క్లుప్తంగా

పెదతీనార్ల సర్పంచ్‌కు అభినందనలు



సర్పంచ్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

నక్కపల్లి : గ్రామంలో సుపరిపాలన అంశంలో జిల్లా స్థాయి అవార్డు అందుకున్న పెద తీనార్ల సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్‌ను, కార్యదర్శి సత్య నారాయణలను మంగళవారం పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు సచివాలయ సిబ్బంది అభినందించారు. పంచాయతీరాజ్ దివస్ సందర్భంగా కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి చేతుల మీదుగా పెద తీనార్ల పంచాయతీ సర్పంచ్ శ్రీనివాస్ జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం పంచాయతీలో సర్పంచ్‌కు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాలకవర్గంతో పాటు, సిబ్బంది, పాల్గొన్నారు. పాలకవర్గం సహకారంతోనే సుపరిపాలన అందించగలుగుతున్నామని సర్పంచ్, కార్యదర్శులు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

మునగపాక: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చేస్తున్న అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, ఇష్టారాజ్య తనిఖీలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మునగపాక జడ్పీహెచ్ఎస్ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో మంగళవారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



భక్తి గీతాలు పాడుతున్న మహిళా భక్తులు

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండలంలోని తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పురోహితులు సంపర భార్గవాచార్యులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో ఆలయ ఛైర్మన్ దాడి దుర్గారావు, కార్యదర్శి శరగడం గోవింద పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎంఈవో అప్పారావు

కోటవురట్ల : విద్యతోనే ఉన్నతమైన భవిష్యత్తు కలుగుతుందని ఎంఈవో అప్పారావు అన్నారు. స్థానిక ఎంపిపి స్కూల్లో పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలతో అలకరించారు. ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. నాడు – నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అభివృద్ధి చేస్తుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. హెచ్ఎం జీవన్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

పాయకరావుపేట : అక్రమంగా సారా, మద్యం బాటిళ్ళు రవాణా చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు పట్టుబడి కేసులు నమోదు చేసిన వాహనాలను ఈ నెల 28 వ తేదీన వేలం వేయడం జరుగుతుందని ఎస్ఈబి ఎస్.ఐ ఎం.రామేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా ఎస్ఈబీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉపాధి పథకానికి నిధులివ్వాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో మంగళవారం సీపీఎం నాయకులు మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ నెల 28న అచ్యుతాపురంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు ఆర్.రాము వారిని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నంనాయుడు, పరదేశినాయుడు, సదాశివ పాల్గొన్నారు.

నవరత్నాలతో నవ శకానికి నాంది



కార్యక్రమంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



దోర్‌లకు స్టిక్కర్లను అతికిస్తున్న నాయకులు



వేంపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి : నవరత్నాలు పథకాలతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నవ శకానికి నాంది పలికారని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు.మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీ నాగేంద్ర కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మతో కలసి పర్యటించారు. 14 వార్డులో ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి వాటి లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలు పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని ధృడసంకల్పంతో అందిస్తున్నారని ఆయన అన్నారు. నాగేంద్ర కాలనీలో మురుగు నీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను చూసిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన కాలువల్లో చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కాలనీలో పలు సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపుగుప్త, యలమంచిలి పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, నాలుగు మండలాలు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను అన్నారు. పట్టణంలో గల మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తాండవ నది ఒడ్డున వున్న చాకలి పేటలో ప్రచారం నిర్వహించారు. నాయకులు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు, అందుతున్న తీరుపై లబ్ధిదారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నకు మద్దతిచ్చి సంక్షేమ పథకాలు కొనసాగేలా కృషి చేయాలని ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, కేశనకుర్తి సత్తిబాబు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నక్కపల్లి : జగనన్న ప్రభుత్వంలో చేసిన మంచి చూసి మద్దతు ఇవ్వాలని నెల్లిపూడి సర్పంచ్ కొలుకులూరి సురేష్ వర్మ, వేంపాడు సచివాలయ కన్వీనరు అయినంపూడి సురేష్‌రాజు తదితరులు ప్రజలను కోరారు. మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న.. కార్యక్రమాన్ని వేంపాడు, నెల్లిపూడి, దోసలపాడు, జగన్నాథపురం, తీనార్ల, గునిపూడి, గొడిచర్ల తదితర గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏమేరకు లబ్ధి కలిగింది. ఏయే పథకాలు వర్తించాయి...అనే వివరాలు తెలుసుకున్నారు. పథకాల అమలులో వివక్ష ఉందా, పారదర్శకంగా అమలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలు తెలుసు కున్నారు. ఇప్పటికిప్పుడు ఎటువంటి ఎన్నికలు లేవు. కేవలం జగనన్న ప్రవేశ పెట్టిన పథకాల వల్ల పేదలకు లబ్ధి కలుగుతోందా లేదా అనేది తెలుసుకోవడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం వల్లమీకు మంచి జరిగిందని భావిస్తే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ కాలు కదపకుండానే ఇంటివద్దకే జగనన్న పథకాలన్ని అందుతున్నాయన్నారు. గతంలో మాదిరిగా నాయకులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం పడలేదన్నారు. ఇంత మంచి చేసే నాయకుడ్ని ఎవరు వదులుకుంటారని, జగన్‌బాబు ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపిస్తాం..అంటూ తెలిపారు. అనంతరం ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో ఏడిద సూరిబాబు, మొల్లి శ్రీను, కరణం ఈశ్వరరావు, నారపు రెడ్డికుమారి, ప్రకాష్, రమణ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

- విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- వైద్యులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో ఎమ్మెల్యే కన్నబాబురాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : అవినీతికి తావు లేకుండా వైద్య సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. మంగళవారం యలమంచిలిలో యలమంచిలి మున్సిపాలిటీ, యలమంచిలి మండలంలోని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, యలమంచిలి ప్రభుత్వాసుపత్రి వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో యలమంచిలి ప్రభుత్వాసుపత్రిపై ఎక్కువగా అవినీతి ఆరోపణలు వచ్చేవని, ప్రస్తుతం డాక్టర్ల మెరుగైన పనితీరు వల్ల సి గ్రేడ్‌లో ఉన్న ఆస్పత్రి బి గ్రేడ్‌కు వచ్చిందని అన్నారు. ఇక్కడ ప్రభుత్వాసుపత్రిలో గతంలో కంటే ప్రస్తుతం 10 మందికి పైగా వైద్యులు సేవలందిస్తున్నారని తెలిపారు. యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది, కాని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు వివిధ ఉద్యోగులు కాని ఏ ఒక్క పేషెంట్‌నైనా ఒక్క రూపాయి లంచం అడిగినట్టు తన దృష్టికి వస్తే మరుక్షణం వారిని విధులు నుంచి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రోగులకు, వారి బంధువులకు తెలిసే విధంగా ఆసుపత్రిలో ఎవరైనా లంచం అడిగితే తక్షణమే తన నెంబరుకు కాల్ చేసే విధంగా ఆస్పత్రి ఆవరణలో తన ఫోన్ నెంబరు ముద్రించిన ఫ్లెక్స్ బోర్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఏ గ్రేడ్‌కు వచ్చే విధంగా సేవలందించి ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొండకర్ల శివాలయంలో ప్రత్యేక పూజలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల శివాలయంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా ప్రముఖ్ పోతు రంగారావు మాట్లాడుతూ మాసాల విశిష్టత, పూజా విధానం, ఆధ్యాత్మిక చింతన గురించి వివరించారు. చేకూరి శ్రీనివాసరాజు, రాజాన సన్యాసినాయుడుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన నూతన వస్త్రాలను పూజలో పాల్గొన్న భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కొల్లి అప్పారావు, రమణ, గుడివాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఎస్పీ సందర్శన

రాంబిల్లి : దిమిలి తపాలా కార్యాలయాన్ని పోస్టల్ ఎస్పీ ప్రసాద్‌బాబు మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. తపాలా కార్యాలయం భవనం రెన్యువల్‌కు సంబంధించి ఆరా తీసారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావు, ఈడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బద్ది వెంకటరమణ పాల్గొన్నారు.

12వ వార్డులో నేడు గడప గడపకు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో 12వ వార్డు గాంధీనగరం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుండి బస్టాండ్ వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటలో తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, సుకుమారవర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందని, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొనాలని అధికారులు కోరారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్లబండి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ

కోటవురట్ల : మండలంలో లింగాపురం గ్రామంలో మంగళవారం పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకొని సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఉత్కంఠభరింతంగా సాగాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కె.రమణ, రుత్తల గోవింద పాల్గొన్నారు.

విజేతలు వీరే...

నరసయ్యపేటకు చెందిన జనపరెడ్డి మోక్షిత్ ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా రూ.12వేలు అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన లక్ష్మీపురానికి చెందిన మహాదేవ్ శ్యాంకుమార్‌కు రూ.10వేలు, తృతీయస్థానం వరసిద్ధి వినాయక రూ.8వేలు, నాలుగో బహుమతి గెలుచుకున్న ఎల్‌బీపట్నంకు చెందిన బండారు హేమతేజకు రూ.6వేలు, ఐదారు స్థానాల్లో కొయిలాడ మనోజ్‌కు రూ.4వేలు, 6వ బహుమతి రూ.3వేలు చొప్పున విజేతలకు మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ అందజేశారు.

ముమ్మరంగా రబీ వరి కోతలు



యంత్ర సాయంతో వరికోత పనులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాల సాయంతో వరి కోత పనులు జరుగుతున్నాయి. మర్రిపాలెం, దిమిలి, రజాల అగ్రహారం, రజాల, కుమ్మరాపల్లి తదితర గ్రామాల్లో సుమారు 2800 ఎకరాల్లో రబీ వరి పంటను రైతులు సాగు చేశారు. యంత్రాలతో పనిచేయడంతో కోత, నూర్పిడి ఒకేసారి అయిపోతున్నాయి. ఈ ఏడాది శారద నదిలో నీరు పుష్కలంగా ప్రవహించడంతో సాగునీటి కష్టాలు తప్పాయి.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని యలమంచిలి మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సాధారణ సమావేశంలో పలు అంశాలు చర్చించనున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి కోరారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



గొడిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



చూచుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

నక్కపల్లి : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గొడిచర్ల పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు, డెంగ్యూ బోదకాలు, మెదడువ్యాపు వంటి వ్యాధులు కూడా దోమల ద్వారానే వస్తాయన్నారు. గ్రామాల్లో మలేరియా వ్యాధి వల్ల వచ్చే నష్టాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తెలియజేయాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, కాలువల్లో మురుగు నీరు పేరుకుపోవడం, చెత్త, కలుషితమైన ఆహారం, నిల్వ ఉన్న పధార్థాలపై దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయన్నారు. వీటి పట్ల అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసాద్, పీహెచ్ఎన్ లీలాకుమారి పాల్గొన్నారు.

చూచుకొండలో...

మునగపాక(అనకాపల్లి): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మునగపాక మండలం చూచుకొండలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌బాబు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది, స్థానికుల సహకారంతో నిర్వహించిన ర్యాలీలో పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వై.కృష్ణ, హెల్త్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని దిమిలిలో మంగళవారం నిర్వహించారు. దోమకాటుతో కల్గే అనర్థాలను వైద్యాధికారి శ్రావణి వివరించారు. నీటిని నిల్వ వుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాసాచార్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు చిట్టిబాబు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఆదాయం కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం : గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాక రెవెన్యూ ఆదాయం కేటాయించాల్సిందేనని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. కొత్త రేవుపోలవరం , గుడివాడ గ్రామ పంచాయతీ వారికి కొత్త రేవుపోలవరం గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గుడివాడ రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్త రేవుపోలవరం గ్రామం 1995లో నూతన పంచాయతీగా ఏర్పాటైందని, అప్పటి నుంచి రెవెన్యూ పరంగా రావాల్సిన ఆదాయం పంచాయతీకి జమకాలేదన్నారు. అయితే తాజాగా సర్పంచ్ మల్లే లోవరాజు జిల్లా పంచాయతీ అధికారులకు దరఖాస్తు చేయడంతో రెవెన్యూ ఆదాయం కేటాయించేందుకు అధికారులు దృష్టి సారించారు. గ్రామ పంచాయతీ సరిహద్దులు నిర్ధారించి ఇకపై వాటి పరంగా వచ్చే స్టాంప్ డ్యూటీ ఇతరత్రా ఆదాయాలు జమ అవుతాయన్నారు. రేవు పోలవరం గ్రామంలో పెదఉప్పలం రెవెన్యూ పరిధిలో ఉందని ఆ పంచాయతీ విడిపోయిన తరువాత కూడా ఆదాయం కేటాయించలేదన్నారు. ఈ మేరకు ఆ గ్రామం నుంచి కూడా సర్పంచ్ చోడిపల్లి అనూరాధ దరఖాస్తు చేసియున్నారని ఈ నెల 28న ఆ గ్రామాల్లో కూడా గ్రామ సభ నిర్వహించి నివేదికలు సమర్పిస్తామని అన్నారు. త్వరలో ఆదేశాలు రాగానే కేటాయింపులు జరుగుతాయన్నారు. గడిచిన 28 ఏళ్ల లావాదేవీల్లో నూతన పంచాయతీలు కోల్పోయిన నగదును కూడా చెల్లించే విధంగా జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ మల్లే లోవరాజు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మండల సర్వేయర్ శ్రీమూర్తి, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్‌కు ఆంధ్రరత్న అవార్డు



ఆంధ్రరత్న అవార్డు అందుకుంటున్న హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్

ఎస్.రాయవరం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గ్రామాల్లో ఉత్తమ సేవలందించినందుకు హెల్త్ అసిస్టెంటు పి.ఎస్.వి.ఎస్ ప్రసాద్‌కు ఆంధ్ర రత్న అవార్డు వచ్చినట్టు తెలిపారు. శ్రీరాంపురం, సర్వసిద్ధి పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించి, కరోనా సమయం నుంచి గ్రామాల్లో రోగులకు వైద్య ఆరోగ్యం పట్ల విస్తృతంగా ప్రచారం చేయడంతో ఈ ఆవార్డుకు ఎంపికై నట్టు చెప్పారు. అఖిల భారత్ తెలుగు సాంస్కృతిక సమైక్య 23 వ వార్షికోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తనకు అవార్డు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు వైద్యసిబ్బంది, స్థానిక నాయకులు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

విద్యా విధానంలో లలిత కళలు భాగం కావాలి



శ్రీ ప్రకాష్ విద్యార్థులతో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, న్యూఢిల్లీ ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై

పాయకరావుపేట : విద్యా విధానంలో లలిత కళలను ఒక భాగంగా చేసినప్పుడే విద్యార్థులకు భారతీయ సంస్కృతి, మన కళలు, ఆచారాలపై పూర్తి అవగాహన కలుగుతుందని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై అన్నారు. శ్రీ ప్రకాష్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు ఇతర దేశాలకు నేడు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూఢిల్లీ, ప్రఖ్యాత నటి జిల్ మిల్ హజారికా మాట్లాడుతూ విద్యతో పాటు నాట్యం, అభినయం తదితర రంగాల్లో యువత ఆసక్తి చూపాలని, తద్వారా మన సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించగలమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఇన్నోవేటివ్ థియేటర్ డైరెక్టర్ డాక్టర్ తూము శివప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీ.రాజు, డైరెక్టర్ హెచ్ఆర్ డాక్టర్ బంగారాజు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఒరిగిన విద్యుత్ స్తంభం



విద్యుత్ శాఖ సిబ్బంది సరిచేసిన తరువాత

కోటవురట్ల : కె.వెంకటాపురంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవలే తెగిపడిన విద్యుత్ తీగలను తాకడం వల్ల విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి చెందిన సంగతి తెలిసిందే. దాంతో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరిపి 25 ఏళ్లుగా కాలం చెల్లి ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ తీగలను, ఒరిగిన విద్యుత్ స్తంభాలను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది మంగళవారం గ్రామంలో విద్యుత్ తీగలను మార్చడంతో పాటు ఒరిగిన స్తంభాలను సరిచేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రమాదాలకు కారణం అవుతున్న విద్యుత్ తీగలను మార్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా జల్ జీవన్ మిషన్ పనులు



గ్రామంలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

ఎస్.రాయవరం : భీమవరం గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌లో ప్రారంభమైన రక్షిత మంచినీటి ట్యాంకు పనులు శరవేగంగా జరుగుతున్నారు. గ్రామానికి రూ.36 లక్షలు కేటాయించడంతో ఇంటింటికీ ఉచిత కుళాయి, నిత్యం సురక్షిత మంచినీటి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఇప్పటికే గ్రామంలో పైపులైను ఏర్పాటు పూర్తి కావడంతో ట్యాంకు నిర్మాణం శరవేగంగా చేపడుతున్నారు. సర్పంచ్ కుమారుడు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గరగా శ్రీనివాసరావు చేపడుతున్న పనులు నిత్యం సమీక్షిస్తున్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతకు సత్కారం



జ్యోత్స్నను సత్కరిస్తున్న ఉగ్గిన అప్పారావు

అనకాపల్లిటౌన్: స్థానిక శ్రీరామదేవ వ్యాయామ సంఘం క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీల్లో విశాఖ ఏయూలో జరిగిన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మంగళవారం పోటీల్లో 52 కేజీల విభాగంలో ఎ.జ్యోత్స్నకు ప్రథమ బహుమతితో పాటు, స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ సాధించినందుకు జిమ్ అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు శాలువతో జ్యోత్స్నను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిమ్ వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిమ్ కార్యదర్శి లక్కరాజు రమేష్, కోశాధికారి వెదుళ్ల వెంకట నూకేశ్వరరావు, ఉపాధ్యక్షులు పెదిరెడ్ల రమేష్ పాత్రుడు, వాకాడ సతీష్, సహాయ కార్యదర్శులు ఉగ్గిన శివ, సోమిశెట్టి భార్గవ్ పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ నిర్వహణకు అభిప్రాయ సేకరణ

అనకాపల్లిటౌన్: పాపయ్యసంతపాలెం గ్రామంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో లోక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ మాట్లాడుతూ పాపయ్యసంతపాలెం గ్రామం, సర్వే నంబర్.176లో 21.692 హెక్టార్లల్లో కలర్ గ్రానైట్‌కు 5,400 క్యూబిక్ మీటర్లు, రోడ్డుమెటల్, బిల్డింగ్ స్టోన్స్, 4,91,400 క్యూబిక్ మీటర్లు, గ్రావెల్ 48,600 క్యూబిక్ మీటర్లు, సంవత్సరానికి తవ్వకం చేపట్టడానికి గ్రామ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టినట్టు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, రహదారికి ఇరువైపులా మొక్కలను నాటి, దుమ్ముధూళి రాకుండా పరిశుభ్రంగా ఉంచాలని, నెలకు ఒకసారి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, క్వారీలో గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరారు.